క్లుప్తంగా

కొవ్వూరులో వేదసభ



వేద సభలో మాట్లాడుతున్న పండితులు

కొవ్వూరు: మానవ ధర్మాన్ని వేదాల్లోనే చూడగల్గుతామని ఆధ్యాత్మిక వేత్త దూళ్లపల్లి దత్తత్రేయ ఘనపాఠి అన్నారు. స్థానిక గౌతమీ నగర్‌లోని పురుషోత్తమ శ్రీరామ మందిరంలో శుక్రవారం వేదసభ నిర్వహించారు. శంకరాచార్య వేద శాస్త్ర పరిషత్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ వేద సభలో సర్వవేద పారాయణం, శాస్త్ర సంరక్షణ గురించి వివరించారు. కార్యక్రమంలో నోరి భోగేశ్వర సోమయాజులు, మేడూరి శ్రీనివాస్, మేడూరి సూర్యనారాయణ, మేడూరి సీత, డి. ప్రభాకర శర్మ తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా శ్రీపుష్పయాగోత్సవం



స్వామివారి శ్రీపుష్పయాగోత్సవం

నిడదవోలు: పట్టణంలో వేంచేసియున్న పురాతన రాజరాజేశ్వర సహిత గోలింగేశ్వర స్వామివారి ఆలయంలో స్వామివారి పంచాహ్నిక దివ్య కళ్యాణ మహోత్సవాల్లో భాగంగా శుక్రవారం శ్రీవారి పుష్పయాగత్సవం (పవళింపు సేవ) వైభవంగా నిర్వహించారు. ఈ కళ్యాణ మహోత్సవంలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామివారి ఉయ్యాల సేవను కనులారా తిలకించి తీర్థప్రసాదాలు స్వీకరించినారు. ఆలయ ఈవో నామా సూర్యప్రకాశ్ రావు, ఆలయ ప్రధాన అర్చకులు, శ్రీకాకుళపు వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

తాగునీటి ఎద్దడి నివారణకు చర్యలు



కొవ్వూరు కౌన్సిల్ సమావేశానికి హాజరైన సభ్యులు

- అధికారులను కోరిన కౌన్సిల్ సభ్యులు
- వాడీవేడిగా కౌన్సిల్ సమావేశం

కొవ్వూరు: వేసవిని దృష్టిలో ఉంచుకుని పురపాలక సంఘంలో తాగునీటి ఎద్దడి తలెత్తకుండా సమ్మర్ యాక్షన్ ప్లాన్ సిద్ధం చేయాలని అధికారులను కౌన్సిల్ సభ్యులు కోరారు. స్థానిక పురపాలక సంఘం కార్యాలయంలో శుక్రవారం చైర్ పర్సన్ బావన రత్నకుమారి అధ్యక్షతన కౌన్సిల్ సాధారణ సమావేశం నిర్వహించారు. పట్టణంలో తాగునీటి పైప్‌లైన్లు లీకవ్వకుండా చర్యలు తీసుకోవాలని సభ్యులు సూచించారు. లే- అవుట్ ఒకటిలో రెండు తాగునీటి మోటారు మరమ్మతులకు గురైతే ఒక్కటే వినియోగంలోకి తీసుకుని రావడం మూలంగా కాలనీ వాసులు ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఔరంగబాద్‌లో డ్రైన్ ఆక్రమణలకు గురికావడంతో మురుగునీరు ముందుకు పారడం లేదని కౌన్సిలర్ కండెల్లి రామారావు సమావేశం దృష్టికి తీసుకువచ్చారు. గతంలో ఆక్రమణల తొలగింపునకు ఉపక్రమిస్తే స్థానిక రైతులు కోర్టుకెళ్లారన్నారు. 2025-26 ఆశీల వసూలు గెజిట్ ప్రతిపాదన అంశం గత కౌన్సిల్ సమావేశంలో వాయిదా వేసినందున ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్‌ను దృష్టిలో ఉంచుకుని జిల్లా కలెక్టర్‌కు నివేదించామని మేనేజర్ పి.సాయిబాబా ప్రకటించారు. ఎన్నికల కోడ్ ముగిసిన తర్వాత కౌన్సిల్ ఆమోదం తీసుకోవాలని సూచించినట్లు తెలిపారు. గోదావరి ఏటిగట్టు వెంబడి ఉన్న రుడా అభివృద్ధి చేసిన పార్కులు తిరిగి వినియోగంలోకి తెచ్చే విధంగా చర్యలు తీసుకోవాలని తొమ్మిదో వార్డు కౌన్సిలర్ పిల్లలమర్రి మురళీకృష్ణ కోరారు. రోడ్డు కం రైలు వంతెనపై భారీ వాహనాల రాకపోకలు నిలుపుదల నేపథ్యంలో ఎక్స్‌ప్రెస్ సర్వీసులు, హైదరాబాద్ వెళ్లే బస్సులు పట్టణ శివారు నుంచి వెళుతున్నాయని, దీంతో స్థానికులు, ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని కౌన్సిలర్ బత్తి నాగరాజు పేర్కొన్నారు. హైవే జంక్షన్ వద్ద బస్టాండ్ నిర్మాణం చేపట్టాలని కోరారు. కోవిడ్‌కు ముందు కొవ్వూరు రైల్వే స్టేషన్‌లో ఆగే అన్నీ ఎక్స్‌ప్రెస్ రైళ్ల హాల్టు కొనసాగించాలని కౌన్సిల్‌లో తీర్మానం చేసి ప్రభుత్వానికి పంపించాలని సభ్యులు సూచించారు. ఎన్నికల కోడ్ అమలులో ఉన్నందున వచ్చే సమావేశంలో తీర్మానం చేసి పంపించేందుకు చర్యలు తీసుకుంటామని చైర్ పర్సన్ బావన రత్నకుమారి తెలిపారు. కమిషనర్ టి.నాగేంద్రకుమార్, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న చైర్‌పర్సన్ బావన రత్నకుమారి

అక్రమ కట్టడాలపై చర్యలేవీ?



నిడదవోలు కౌన్సిల్ సమావేశానికి హాజరైన సభ్యులు

- బడా బాబుల అక్రమ కట్టడాలను వదిలేస్తున్నారు
- అధికారులను నిలదీసిన వైఎస్సార్‌సీపీ సభ్యులు

నిడదవోలు: పట్టణంలో అనుమతులు లేకుండా నిర్మిస్తున్న అక్రమ కట్టడాలపై ఏం చర్యలు తీసుకున్నారని వైఎస్సార్ సీపీ కౌన్సిలర్ పువ్వుల రతీదేవి అధికారులను ప్రశ్నించారు. స్థానిక మున్సిపల్ సమావేశ మందిరంలో మున్సిపల్ చైర్మన్ భూపతి ఆదినారాయణ అధ్యక్షతన శుక్రవారం మున్సిపల్ సాధారణ సమావేశం నిర్వహించారు. ముందుగా ఇటీవల మృతి చెందిన మాజీ కౌన్సిలర్ గుబ్బల నాగేశ్వరరావుకి సభ్యులు సంతాపం తెలిపారు. కౌన్సిలర్లు పువ్వుల రతీదేవి, కామిశెట్టి సత్యనారాయణలు మాట్లాడుతూ రోడ్డు మార్జిన్‌లో వ్యాపారాలు చేస్తున్న చిరు వ్యాపారులను ఖాళీ చేయిస్తున్నారని, పట్టణంలో పెద్ద వ్యాపారులను ఖాళీ చేయించకుండా కాలయాపన చేస్తున్నారని ఆరోపించారు. పైగా కౌన్సిలర్లు చెప్పడంతోనే ఖాళీ చేయిస్తున్నామని చిరు వ్యాపారులకు చెప్పడంపై అభ్యంతరం వ్యక్తం చేశారు. పట్టణంలో ప్రధాన సెంటర్లలో డ్రైనేజీలను అక్రమించుకుని ఎటువంటి అనుమతులు లేకుండా అక్రమ కట్టడాలను నిర్మిస్తున్నారని, సెల్లార్లకు అనుమతులు తీసుకుని బిల్డింగ్‌లు నిర్మిస్తున్నారని అధికారులను నిలదీశారు. అసలు ఎన్ని అక్రమ కట్టడాలను రెగ్యులర్ చేశారు. ఎంత మందికి నోటీసులు ఇచ్చారో చెప్పాలని పట్టుబట్టారు. దీనిపై పట్టణ ప్రణాళిక అధికారి సుప్రియ సమాధానం ఇస్తూ పట్టణంలో అనధికార నిర్మాణాలపై నెలన్నర సమయంలో చర్యలు తీసుకుంటామన్నారు. దీనిపై చైర్మన్ భూపతి ఆదినారాయణ మాట్లాడుతూ మార్చిలో జరిగే కౌన్సిలర్ సమావేశానికల్లా అక్రమ కట్టణాలపై చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. పట్టణంలో కుక్కల సంచారం ఎక్కువైందని గత కౌన్సిల్‌లో ఇదే అంశంపై అడిగినా చర్యలు తీసుకోలేదని కౌన్సిలర్ పువ్వుల రతీదేవి సమావేశం దృష్టికి తీసుకువచ్చారు. దీనిపై మున్సిపల్ ఏఈ హేమంత్ మాట్లాడుతూ పట్టణంలో కుక్కల సంచారం వాస్తవమేనని, అయితే రాజమహేంద్రవరం కార్పొరేషన్ ఆధ్వర్యంలో ఎంహెచ్‌వో అనుమతులతో చర్యలు తీసుకోవాల్సి ఉందన్నారు. దీనిపై త్వరలో చర్యలు తీసుకుంటామన్నారు. సమావేశంలో మున్సిపల్ వైస్ చైర్మన్లు గంగుల వెంకటలక్ష్మి, యలగాడ బాలరాజు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

సూపర్ సిక్స్ హామీలను విస్మరించిన ప్రభుత్వం



నంబూరి శ్రీమన్నారాయణ

కొవ్వూరు: రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో సూపర్ సిక్స్ హామీలను విస్మరించిందని పౌర హక్కుల సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు నంబూరి శ్రీమన్నారాయణ ఆరోపించారు. ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్ ప్రవేశ పెట్టిన రూ.3.22 లక్షల కోట్ల బడ్జెట్‌లో నిరుద్యోగ భృతి ప్రస్తావన లేకపోవడం బాధకరమన్నారు. మహిళలకు ఉచిత బస్సు పథకానికి కేటాయింపులు చేయలేదన్నారు. పంటలకు గిట్టుబాటు ధరలు కల్పించేందుకు ఏర్పాటు చేయాల్సిన ధరల స్థిరీకరణకు రూ.3 వేల కోట్ల నిధి ఏర్పాటు చేయాల్సి ఉండగా కేవలం రూ.300 కోట్లు మాత్రమే కేటాయించడం బాధాకరమన్నారు. అన్నదాత సుఖీభవ, పీఎం కిసాన్ పథకానికి రూ.13,500 కోట్లు అవసరం కాగా రూ.6,300 కోట్లు మాత్రమే కేటాయించిందన్నారు. కీలకమైన వైద్య రంగానికి 6 శాతం నిధులు కేటాయించాల్సి ఉండగా కేవలం 2.5 శాతం నిధులు మాత్రమే కేటాయించారని మండిపడ్డారు. కార్మికుల సంక్షేమాన్ని పట్టించుకోలేదన్నారు. ఎస్సీ, ఎస్టీ సంక్షేమానికి కేటాయించిన నిధుల్లో కోత విధించారని ఆరోపించారు. బడ్జెట్ కేటాయింపులు నిరాశజనకంగా ఉన్నాయని ఆయన ఆరోపించారు.

అదనపు విద్యుత్ లోడును క్రమబద్ధీకరించుకోవాలి

దేవరపల్లి: అదనపు విద్యుత్ లోడును గృహ వినియోగదారులు క్రమబద్ధీకరించుకోవాలని ఏపీఈపీడీసీఎల్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ ఎన్.నారాయణ అప్పారావు అన్నారు. ఆయన శుక్రవారం 'సాక్షి'తో మాట్లాడారు. స్వచ్ఛందంగా క్రమబద్ధీకరించుకునే వినియోగదారులకు డెవలప్‌మెంట్ చార్జీల చెల్లింపులో 50 శాతం రాయితీ కల్పిస్తున్నామని, ఇది జూన్ 30వ తేదీ వరకూ అమలవుతుందన్నారు. ఆలోపు అన్ని ఎలక్ట్రిసిటీ రెవెన్యూ కార్యాలయాలు, మీ సేవ కేంద్రాలలో, ఏపీఈపీడీసీఎల్ వెబ్‌సైట్ www.apearternpower.comలో దరఖాస్తు చేసుకోవాలన్నారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

కొవ్వూరు: కాకినాడ ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ వ్యక్తి మృతి చెందిన ఘటనపై కేసు నమోదు చేసినట్లు స్థానిక పోలీసులు తెలిపారు. వివరాల్లోకి వెళితే.. కొవ్వూరు పట్టణం క్రిస్టియన్ పేటకు చెందిన కోట మసలయ్య (80) గత నెల 23న ఇంటి వద్ద మునగ చెట్టు ఎక్కి కాయలు కోస్తుండగా ప్రమాదవశాత్తూ జారిపడ్డారు. దీంతో ఆయన్ను కుటుంబ సభ్యులు కొవ్వూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అక్కడి నుంచి మెరుగైన చికిత్స నిమిత్తం కాకినాడ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ శుక్రవారం మృతి చెందినట్లు పట్టణ ఎస్సై కె.జగన్ మోహన్‌రావు తెలిపారు. మృతుడి కుమారుడు ప్రసాద్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు చెప్పారు.

మృతుడి ఆచూకీ లభ్యం

కొవ్వూరు: పట్టణంలోని ఆర్టీసీ బస్టాండ్‌లో గురువారం మృతి చెందిన వ్యక్తి రాజమహేంద్రవరం రూరల్ మండలం నామవరం శాటిలైట్ సిటీకి చెందిన కసిరెడ్డి రవి(55)గా గుర్తించినట్లు పట్టణ ఎస్సై కె.జగన్‌మోహన్‌రావు తెలిపారు. శుక్రవారం మీడియాలో వచ్చిన కథనాల ద్వారా మృతుడి కుటుంబ సభ్యులు గుర్తించినట్లు ఆయన తెలిపారు. జంగారెడ్డిగూడెంలోని అంబికా రెస్టారెంట్‌లో పని చేస్తున్న రవి ఇంటికి వచ్చేందుకు బయలుదేరి మార్గంమధ్యలో కొవ్వూరు బస్టాండ్‌లో దిగారు. అక్కడ గుండెపోటు వచ్చి మృతి చెంది ఉండవచ్చని పోలీసులు భావిస్తున్నారు. మృతుడి భార్య భారతి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు తెలిపారు. మృతుడికి భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం అనంతరం కుటుంబ సభ్యులకు అప్పగించినట్లు ఎస్సై తెలిపారు.

అంకితభావంతో పనిచేయాలి

నిడదవోలు: ఉద్యోగులు తమ విధులను అంకితభావంతో నిర్వహిస్తే ఏ రంగంలో ఉన్నా మంచి గుర్తింపు లభిస్తుందని మున్సిపల్ చైర్మన్ భూపతి ఆదినారాయణ అన్నారు. మున్సిపల్ సీనియర్ అసిస్టెంట్ బుద్దాల వెంకటేశ్వరరావు ఉద్యోగ విరమణ చేశారు. ఈ మేరకు పట్టణంలో మున్సిపల్ కార్యాలయంలోని సమావేశ మందిరంలో శుక్రవారం మున్సిపల్ ఉద్యోగుల ఆధ్వర్యంలో మున్సిపల్ సీనియర్ అసిస్టెంట్ బుద్దాల వెంకటేశ్వరరావు, లక్ష్మి దంపతులను ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్లు గంగుల వెంకటలక్ష్మి, యలగాడ బాలరాజు, మున్సిపల్ కమిషనర్ టి.కృష్ణవేణి, మున్సిపల్ డీఈఈ సత్యనారాయణ, టీపీవో సుప్రియ, ఏఈ హేమంత్, కౌన్సిలర్లు, మున్సిపల్ ఉద్యోగులు పాల్గొన్నారు.

ఉద్యోగ విరమణ తప్పనిసరి

నల్లజర్ల: అధికారులకు ఉద్యోగ విరమణ తప్పనిసరి అని ఈఈ నారాయణం అప్పారావు అన్నారు. నల్లజర్ల విద్యుత్ సెక్షన్ కార్యాలయంలో లయన్ ఇనస్పెక్టర్‌గా పని చేసి ఉద్యోగ విరమణ చేసిన ఈదా డేవిడ్‌ను ఆ శాఖ కార్యాలయంలో శుక్రవారం ఘనంగా సత్కరించారు. విధి నిర్వహణలో ఆయన చేసిన సేవలను కొనియాడారు. ఏడీఏ శివప్రసాద్, ఏఈలు బాపిరాజు, రమణ, 1104 యూనియన్ నాయకులు పాల్గొన్నారు.

శర్మ సేవలు అభినందనీయం

కొవ్వూరు: పంచాయతీ రాజ్ శాఖకు 35 ఏళ్ల పాటు కల్లూరి ఉమామహేశ్వరశర్మ అందించిన సేవలు అభినందనీయమని పలువురు వక్తలు అన్నారు. పట్టణంలో లిటరరీ క్లబ్ కల్యాణ మండపంలో శుక్రవారం కొవ్వూరు ఈవోపీఆర్డీగా పనిచేస్తున్న ఉమామహేశ్వర శర్మ ఉద్యోగ విరమణ సభ ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా శర్మ దంపతులను ఘనంగా సత్కరించి జ్ఞాపికలు అందజేశారు. ఆయన సేవలను కొనియాడారు. కార్యక్రమంలో ఎంపీడీవో కె.సుశీల, ఎంపీపీ కాకర్ల సత్యనారాయణ, తాళ్లపూడి మాజీ ఎంపీపీ కొమ్మి రెడ్డి పరశు రామారావు, నామన పరమేశ్వరరావు, మునిసిపల్ మాజీ చైర్మన్ సూరపనేని చిన్ని తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా టైలర్స్ డే

తాళ్లపూడి: కుట్టుమెషీన్ సృష్టికర్త విలియమ్స్ హో జయంతి సందర్భంగా శుక్రవారం ప్రపంచ టైలర్స్ డేను ఘనంగా నిర్వహించారు. స్థానిక మదనగోపాలస్వామి ఆలయం వద్ద విలియమ్స్ హో చిత్రపటానికి మండల టైలర్ల సంఘం అధ్యక్షుడు వంబోలు పోసిబాబు ఆధ్వర్యంలో పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా పోశిబాబు మాట్లాడుతూ టైలర్ల సంక్షేమం కోసం ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో టైలర్ల సంఘం సభ్యులు యలమర్తి సుబ్రమణ్యం, పోతుల గాంధీ, జి.రామాంజనేయులు, గొలుసు రవి, తిపర్తి రాము, గణపతి, తాతారావు తదితరులు పాల్గొన్నారు.

సీనియర్ టైలర్‌కు సత్కారం

నల్లజర్ల: ప్రపంచ టైలర్స్ దినోత్సవాన్ని పురస్కరించుకుని టైలర్స్ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో కుట్టుమెషీన్ సృష్టికర్త విలయమ్స్ హోవే జయంతిని శుక్రవారం అనంతపల్లి ఆర్యవైశ్య కల్యాణ మండపంలో ఘనంగా నిర్వహించారు. సంఘ అధ్యక్షులు తలారి కృష్ణ అధ్యక్షత వహించారు. విలియమ్స్ హోవే చిత్రపటానికి నివాళులర్పించారు. సీనియర్ టైలర్ జగతి నాగరాజును సత్కరించారు. రాష్ట్రంలో టైలర్స్ ఫెడరేషన్ ఏర్పాటు చేసి దర్జీ కళాకారులను ఆదుకోవాలని సంక్షేమ సంఘం కోరింది. పోతవరంలో సంఘం అధ్యక్షులు రావిపాటి జగదీష్ అధ్యక్షతన టైలర్స్‌డే వేడుకలు జరిగాయి. గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వం జగనన్నచేదోడు పథకంతో టైలరింగ్ వృత్తికి ప్రాణం పోశారన్నారు.

దుర్గాభవానికి సన్మానం

దేవరపల్లి: టైలర్ల గురువు ఎస్.దుర్గాభవానిని అంతర్జాతీయ టైలర్ల దినోత్సవం సందర్భంగా శుక్రవారం దేవరపల్లి మండలం యర్నగూడెంలో హెల్పింగ్ హ్యాండ్స్ వెల్ఫేర్ సొసైటీ బొల్లిన గంగరాజు జెడ్పీ హైస్కూలు పూర్వ విద్యార్థుల ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. సొసైటీ కె.బాలకృష్ణ మాట్లాడుతూ పార్డ్ ఇండియా స్వచ్ఛంద సేవా సంస్థ అధినేత బీవీ స్వామి గ్రామంలో సుమారు 200 మంది మహిళలకు టైలరింగ్ నేర్పించినట్టు ఆయన తెలిపారు. శిక్షణ పొందిన మహిళలకు స్వయం ఉపాధి కల్పించడానికి ఉచితంగా కుట్టు మెషీన్లు అందజేసినట్టు ఆయన తెలిపారు. కుట్టు శిక్షణ పూర్తి చేసుకున్న మహిళలు ఆర్థికంగా అభివృద్ధి చెందుతున్నట్టు ఆయన తెలిపారు. కార్యక్రమంలో సొసైటీ సభ్యులు చంద్రశేఖర్, దుర్గారావు, పలువురు మహిళలు పాల్గొన్నారు.

ఇంటర్ పరీక్షలకు సర్వం సిద్ధం

- నేటి నుంచి పరీక్షలు
- ఏర్పాట్లు పూర్తి చేసిన అధికారులు



వేగేశ్వరపురంలో ఇంటర్ పరీక్షలకు సిద్ధం చేసిన బెంచీలు

తాళ్లపూడి: ఇంటర్మీడియెట్ పబ్లిక్ పరీక్షలకు సర్వం సిద్ధమైంది. పరీక్షలను పారదర్శకంగా నిర్వహించేందుకు అధికారులు ఏర్పాట్లు పూర్తి చేశారు. శనివారం నుంచి ఈ నెల 15వ తేదీ వరకూ పరీక్షలు జరగనున్నాయి. మండలంలోని వేగేశ్వరపురం ప్రభుత్వ జూనియర్ కళాశాలలో పరీక్ష కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. ఇక్కడ మొదటి సంవత్సరం 325 మంది, ద్వితీయ సంవత్సరం 260 మంది విద్యార్థులు పరీక్షకు హాజరు కానున్నారు. తాళ్లపూడి కరిబండి విద్యా సంస్థల ఆధ్వర్యంలోని కరిబండిగ నిరాజు సూర్యకుమారి జూనియర్ కళాశాల విద్యార్థులు, తాళ్లపూడిలోని ఒకేషనల్ కళాశాల విద్యార్థులు ఇక్కడే ఇంటర్ పరీక్షలు రాయనున్నారు. మొత్తం ఈ పరీక్షా కేంద్రంలో ఇంటర్ ప్రథమ, ద్వితీయ సంవత్సరం కలిపి 585 మంది పరీక్షలు రాయనున్నారు. పరీక్ష కేంద్రాల వద్ద సీసీ కెమెరాలు ఏర్పాటు చేశారు. విద్యార్థులకు ఎటువంటి అసౌకర్యం లేకుండా అన్ని ఏర్పాట్లు చేసినట్టు కళాశాల చీఫ్ సూపరింటెండెంట్ పి.గౌరీనాథ్ తెలిపారు.

నల్లజర్లలో చికెన్, ఎగ్ మేళా



నల్లజర్లలో జరిగిన చికెన్ మేళాలో మాట్లాడుతున్న పశుసంవర్ధక శాఖ డీడీ శామ్యూల్

నల్లజర్ల: చికెన్‌లో ఎటువంటి వ్యాధులు లేవని వివిధ ల్యాబ్‌లలో చేసిన పరీక్షల వల్ల తేలిందని చికెన్ తినడం వల్ల ఎటువంటి ఇబ్బంది ఉండదని అందరూ హాయిగా చికెన్ తినవచ్చని పశుసంవర్ధక శాఖ డీడీ శామ్యూల్ అన్నారు. నెక్ సంస్థ ఆధ్వర్యంలో శుక్రవారం నల్లజర్లలో చికెన్ మేళా నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ బర్డ్‌ఫ్లూ జిల్లాలో ఒక్క ఉండ్రాజవరంలోనే ఒక్క కేసు నమోదైందన్నారు. మిగతా చోట్ల వైరస్ వల్ల కోళ్లు చనిపోయాయని ఇంక ఎక్కడా ఇటువంటి సంఘటనలు జరగలేదన్నారు. వివిధ ప్రాంతాల్లో కోళ్లను తీసుకెళ్లి వివిధ ల్యాబ్‌లలో పరీక్షలు చేయించామని ఎక్కడా వైరస్ ఉన్నట్లుగా రుజువు కాలేదన్నారు. వదంతులు నమ్మవద్దని కోరారు. కార్యక్రమంలో ఎంపీడీఓ సింహాద్రి, డిప్యూటీ తహసీల్దార్ శాంతిప్రియ, పీహెచ్‌సీ డాక్టర్లు గంగాధరావు, సిరాజుద్దీన్, సీఐ విజయశంకం, ఎస్సై సోమరాజు, ఫౌల్ట్రీ యజమానులు రావూరి వెంకటరమణ, పసుమర్తి రతీష్, బూరుగుపల్లి వేణు, నెక్ సంస్థ ప్రతినిధి సంతోష్ తదితరులు పాల్గొన్నారు.

బోధనోపకరణ సామగ్రితో విద్యార్థుల్లో నైపుణ్యం



కాల్దరి ప్రాథమిక పాఠశాలలో బోధనోపకరణ సామగ్రితో ఉపాధ్యాయులు

ఉండ్రాజవరం: బోధనోపకరణ సామగ్రి ఉపయోగించడం ద్వారా విద్యార్థుల్లో నైపుణ్యం వెలికితీయవచ్చని పాఠశాల హెచ్ఎం సుభద్రాభాను అన్నారు. మండలంలో కాల్దరి ప్రాథమిక పాఠశాల నెంబర్-3లో శుక్రవారం సైన్స్ దినోత్సవం ఘనంగా నిర్వహించారు. సీవీ రామన్ చిత్రపటానికి వేలివెన్ను కాంప్లెక్స్ సెక్రటరీ గణేష్ పూలమాల వేసి నివాళులర్పించారు. ఆటోమేటిక్ ఫైర్ అలారం, ఫైర్ ఇంజిన్ పని చేసే విధానం, ఆటోమేటిక్ వాటర్ సిస్టం, కూలర్, వాషింగ్‌మెషీన్, ఏటీఎం, వర్కింగ్ రోబో, ట్రైన్ పని చేసే విధానం, ఇటీవల ఇస్రో ప్రయోగించిన చంద్రయాన్-3 వర్కింగ్ మోడల్‌ను పాఠశాల టీచర్ కుసుమ విద్యార్థులకు కళ్లకు కట్టినట్లు చూపించారు. విద్యార్థులు సైతం ఆసక్తిగా తిలకించారు. కుసుమ మాట్లాడుతూ ప్రత్యేకంగా అనేక రకాల బోధన ఉపకరణాలను తయారు చేసి, ప్రయోగాత్మకంగా విద్యార్థులకు బోధించామన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు శివప్రసాద్, హేమలత పాల్గొన్నారు.

సైన్స్‌పై అవగాహన పెంచుకోవాలి

- ఘనంగా జాతీయ సైన్స్ దినోత్సవం
- ఆకట్టుకున్న సైన్స్ ప్రాజెక్టులు, ప్రదర్శనలు



వేగేశ్వరపురం ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో సైన్స్ ప్రాజెక్టులు ప్రదర్శిస్తున్న విద్యార్థులు

తాళ్లపూడి: విద్యార్థులకు సైన్స్ ప్రయోగాల పట్ల అవగాహన కల్పించడంతో పాటు వారిని ప్రోత్సహిస్తే మేధావులుగా తయారు చేయవచ్చని ఎంఈవో సీహెచ్ బాలామణి పేర్కొన్నారు. మండలంలోని ప్రభుత్వ పాఠశాలల్లో శుక్రవారం జాతీయ సైన్స్ దినోత్సవం నిర్వహించారు. వేగేశ్వరపురం ప్రభుత్వ ఉన్నత పాఠశాల వద్ద విద్యార్థులు పలు సైన్స్ ప్రాజెక్టులను తయారు చేసి ప్రదర్శన ఏర్పాటు చేశారు. రోబోటిక్, క్లీనింగ్, పర్యావరణ కాలుష్యం, శరీరభాగాలు పనితీరు, హైడ్రాలిక్ సిస్టమ్ తదితర వాటి పని తీరును వివరించారు. ఎంఈవో, పాఠశాల హెచ్ఎం సీహెచ్ బాలామణి, సైన్స్ ఉపాధ్యాయరాలు భవాని తదితరులు పాల్గొన్నారు. తాళ్లపూడి జెడ్పీ ఉన్నత పాఠశాలలో హెచ్ఎం సుబ్బలక్ష్మి ఆధ్వర్యంలోనూ, సూర్య హైస్కూల్లో కరస్పాండెంట్ ఎం సీతామహలక్ష్మి ఆధ్వర్యంలోనూ విద్యార్థులు వర్కింగ్ నమునాలు తయారు చేశారు.

నూతన ఆవిష్కరణలు అందించాలి

ఉండ్రాజవరం: సీవీ రామన్ స్ఫూర్తితో విద్యార్థులు శాస్త్రవేత్తలుగా రూపొంది, కొత్త ఆవిష్కరణలు అందించాలని ఉండ్రాజవరం, మోర్త ఉన్నత పాఠశాలల హెచ్ఎంలు కె.మాణిక్యాలరావు, శ్రీనివాస్ అన్నారు. జాతీయ సైన్స్ దినోత్సవం సందర్భంగా ఉండ్రాజవరం, మోర్త ఉన్నత పాఠశాలల్లో శుక్రవారం సీవీ రామన్ జయంతిని ఘనంగా నిర్వహించారు. పాఠశాలల్లో సైన్స్ ఉపాధ్యాయుల ఆధ్వర్యంలో విద్యార్థులు తయారు చేసిన పలు సైన్స్ ఎగ్జిబిట్స్ ప్రదర్శన ఎంతగానో ఆకట్టుకుంది. మోర్తలో వ్యాసరచన, వక్తృత్వ పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు ప్రదానం చేశారు. సైన్స్ ఉపాధ్యాయులు గోపాలకృష్ణ, ఎం.నాగమణి, సుబ్బారావు, లక్ష్మీనారాయణ, మాధవి, కోటి మాణిక్యం, అరుణకుమారి, తంగిరాల రామ శేషేంద్ర మాట్లాడారు.

కొవ్వూరు: స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో శుక్రవారం జాతీయ సైన్స్ దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు తయారు చేసిన ప్రాజెక్టులు, నమూనాలను ప్రదర్శించారు. కళాశాల ప్రిన్సిపల్ జె.సునీత మాట్లాడుతూ విద్యార్థులు సైన్స్ పట్ల అవగాహన పెంచుకోవాలని సూచించారు. వైస్ ప్రిన్సిపల్ సూర్యనారాయణ, భూపతిరాయులు, సునీత, సాదిక్ అహ్మద్, అరుణ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

కొత్త ఆవిష్కరణలకు నాంది పలకాలి

నల్లజర్ల: విద్యార్థులు కొత్త ఆలోచనలు, ఆవిష్కరణలకు శ్రీకారం చూట్టాలని డైట్ ప్రిన్సిపాల్ ఎం.కమలకుమారి సూచించారు. దూబచర్లలోని జిల్లా ఉపాధ్యాయ శిక్షణ కేంద్రం(డైట్)లో శుక్రవారం జాతీయ సైన్సు దినోత్సవం నిర్వహించారు. ప్రిన్సిపాల్ కమలకుమారి ఆధ్వర్యంలో సీవీ రామన్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో అధ్యాపకులు పీవీ రమణమూర్తి, వి.వెంకటేశ్వరావు, శామ్యూల్ సంజీవ్, సీహెచ్ లక్ష్మీనారాయణ, ఎం.రాంప్రసాద్, సూపరింటిండెంట్ పీవీ సుభాకర్ పాల్గొన్నారు.